సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రిలే నిరాహార దీక్షల విరమణ

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ వాల్తేర్ డిపో పరిధిలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.సిహెచ్.శేఖర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలను విరమించారు. ఈ విషయాన్ని యూనియన్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై కోర్టులో విచారణ ఉన్నందున.. రిలే దీక్షలను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు చెప్పారు. అక్రమ సస్పెన్షన్‌పై శేఖర్ హైకోర్టును ఆశ్రయించగా.. సానుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. వాల్తేర్ డిపో మేనేజర్ సుధాకర్, ఉన్నతాధికారులు దాన్ని అమలు చేయనందున కోర్టు ధిక్కరణ కేసు వేసినట్లు తెలిపారు. దీనిపై కోర్టు విచారణ ఉన్న నేపథ్యంలో దీక్షలకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు డి.ఎస్.బాబు, కార్యదర్శి బి.ఎస్.రావు వెల్లడించారు.

మత పెద్దల కృషితో బాల్య వివాహాల నియంత్రణ



మాట్లాడుతున్న డేవిడ్ రాజు

ఆరిలోవ: బాల్య వివాహాల నియంత్రణ కోసం వివిధ మత పెద్దలు కృషి చేయాలని అప్‌హోల్డ్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జి.డేవిడ్ రాజు కోరారు. ఆర్గనైజేషన్ సభ్యులతో కలసి ఆయన సోమవారం పెదగదిలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బాలల హక్కుల సంరక్షణ, బాల్య వివాహాలు నివారించడానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో అందులో భాగంగా కొన్ని చోట్ల బాల్య వివాహాలు జరిగే అవకాశముందన్నారు. అలాంటి వివాహాలు జరగకుండా అన్ని మతాల పెద్దలు అడ్డుకోవాలని కోరారు. బాల్య వివాహాల వల్ల పిల్లలు భవిష్యత్‌లో ఇబ్బంది పడతారని చెప్పారు. వీటితో పాటు తమ సంస్థ బాలల అక్రమ రవాణాను అడ్డుకుంటోందని తెలిపారు. ఇటీవల వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 100 మంది పిల్లలను ఆంధ్రప్రదేశ్ రైల్వే స్టేషన్లలో రైల్వే పోలీసుల సహకారంతో పట్టుకుని తిరిగి వారికి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. బాల్య వివాహాలు చేయడం, బాలలను అక్రమంగా తరలించడం తదితర కార్యకలాపాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారు చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. సమావేశంలో సభ్యులు చక్రవర్తి, ఏసురత్నం పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందాయి. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి రెండు ఫిర్యాదులను జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధుసూదనరావు, ఆర్టికల్చర్ అధికారి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేటలో చోరీ

సీతమ్మధార: ఇంట్లో బీరువా తాళాలు తీసి దొంగతనానికి పాల్పడిన ఘటన ఆదివారం సీతంపేటలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాల లక్ష్మి అనే ఓ మహిళా భర్త, కుమారులతో కలిసి సీతంపేట గణేష్ నగర్‌లోని రాధాకృష్ణ టెంపుల్ ఎదురుగా ఉన్న ఇంట్లో నివసిస్తోంది. ఆదివారం ఎప్పటిలాగే ఆమె ఉద్యోగానికి వెళ్లే ముందు ఇంటి తలుపులు వేసి తాళాలు కిటికీ పక్కన పెట్టింది. రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా.. తలుపుల తాళాలు తీసి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళాలు దానికి వదిలి ఉండటాన్ని గమనించారు. కంగారుగా బీరువా తెరచి చూడగా.. అందులో ఉన్న 1.5 తులాల బంగారం, 7.5 తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు పోయినట్టు గుర్తించారు. సోమవారం ఉదయం బాధితురాలు ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణ లేక భక్షణ





విశాలాక్షినగర్‌లో వివాదాస్పదంగా మారిన పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలం

- ఆక్రమణల చెరలో పశు సంవర్ధక శాఖ స్థలాలు
- హనుమంతవాక ప్రాంతంలో వందల ఎకరాల కొలదీ భూములు
- వాటిపై కన్నేసిన కొందరు ఆక్రమణదారులు
- విలువైన భూములను సంరక్షించే నాథులు కరువు
- ఖాళీగా ఉండటంతో కబ్జాలకు యత్నం

పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలాలకు రెక్కలొస్తున్నాయి. ఉన్నతాధికారులు వాటికి సరైన రక్షణ వలయం ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడపడితే అక్కడ రూ.కోట్ల విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిని అడ్డుకోవద్దని కొందరు రాజకీయ నాయకులు నుంచి అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. మరోపక్క రక్షణ గోడలు నిర్మించడానికి సైతం నిధులు లేవు. దీంతో స్థలాలు సంరక్షించుకోవడానికి అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. దీంతో ఆ శాఖకు చెందిన ఖాళీ స్థలాలపై కొందరు కన్నేసి దర్జాగా కబ్జా చేస్తున్నారు.

– ఆరిలోవ

జాతీయ రహదారిని ఆనుకొని అటు విశాలాక్షినగర్.. ఇటు హనుమంతవాక నుంచి తోటగరువు, చినగదిలి వరకు పశు సంవర్ధక శాఖకు చెందిన వందల కొలదీ ఎకరాల భూమి ఉండేది. దానిలో అధికారులు పశు గ్రాసం పండించడంతోపాటు కార్యాలయాలు, అవసరాల కోసం భవన నిర్మాణాలకు వినియోగించేవారు. ఆ స్థలాల్లో సుమారు 20 ఏళ్ల కిందట విమ్స్, హెల్త్‌సిటీ నిర్మాణాల కోసం అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ శాతం భూమి తీసుకొంది. ప్రస్తుతం హెల్త్‌సిటీ పరిసరాలు(చినగదిలి ఎదురుగా), తోటగరువు, పెదగదిలి ఎదురుగా, విశాలాక్షినగర్(వెటర్నరీ లేఅవుట్‌ను ఆనుకొని), పాత డెయిరీ ఫారం పరిసరాల్లో సుమారు 80 నుంచి 90 ఎకరాల వరకు మిగిలినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ భూమిని సంరక్షించడంలో శాఖాధికారులు నిర్లక్ష్యం చూపడంతో ఆయా స్థలాల్లో కొన్ని చోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయి.

నిధుల కేటాయింపులు నిల్..

కొన్ని వందల కోట్ల రూపాయలు విలువ చేసే పశు సంవర్ధక శాఖ భూములను గాలికొదిలేశారు. వాటి చుట్టూ రక్షణ గోడ నిర్మించడానికి కూడా ఆ శాఖ నిధులు కేటాయించడం లేదు. ఈ కారణంగా భూమలకు అధికారులు సంరక్షణ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇది ఎవరి నిర్లక్ష్యమో తెలియని పరిస్థితి. రాష్ట్ర స్థాయిలో పశు సంవర్ధక శాఖ నిధులు కేటాయించకపోవడం వల్ల రక్షణ కరువైందా.. లేక ఇక్కడ జిల్లా స్థాయి అధికారులు కావాలనే సంరక్షణ చేయలేకపోతున్నారో అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే రూ.కోట్ల విలువైన భూములకు రక్షణ కవచం ఏర్పడుతుందని పలువురు భావిస్తున్నారు.

విశాలాక్షినగర్‌లో స్థల వివాదం

జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కొత్తగా ఏర్పాటైన వెటర్నరీ కాలనీలో జాతీయ రహదారికి సమీపంలోని పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఇక్కడ సర్వే నంబర్ 133/8లో పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు 30 ఎకరాలకు పైగా స్థలం ఉండేది. దానిలో 18.78 ఎకరాలను పశు సంవర్ధక శాఖ వైద్యుల నివాస స్థలాలకు ప్రభుత్వం కొన్నేళ్ల కిందట కేటాయించింది. మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. దాని ఉట్టూ ఎలాంటి రక్షణ గోడ గాని, కనీసం ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ ఖాళీ స్థలం మాదేనంటూ వారం కిందట కొందరు వ్యక్తులు వచ్చి స్వాధీనం చేసుకోదలిచారు. ఈ వ్యవహారం ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు చేరింది. దీంతోపాటు రెవెన్యూ అధికారులను సైతం ఆశ్రయించాల్సి వచ్చింది.

పెదగదిలి గెడ్డ అంచున..

పెదగదిలి గెడ్డ అంచున ఎర్నిదుర్గమాంబ ఆలయం పక్కన పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు అరెకరం ఖాళీ స్థలంలో కొంత భాగం ఇటీవల ఆక్రమణకు గురైంది. దానిలో కొందరు శివాలయం నిర్మాణంతోపాటు చుట్టూ వాణిజ్య సముదాయం నిర్మించడానికి సన్నాహాలు చేపట్టారు. ఆలయం కోసం షెడ్ నిర్మించారు. ఆ స్థలంలో పక్కా నిర్మాణం చేపట్టడానికి సైతం సిద్ధమయ్యారు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆ శాఖ అధికారులు స్పందించి నిర్మాణాలను అడ్డుకుని కర్రలతో కంచె వేసి వదిలేశారు. దాని చుట్టూ రక్షణ గోడ నిర్మిస్తామని పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రకటించి.. నెలలు గడుస్తున్నా ఎటువంటి నిర్మాణం చేపట్టలేదు. దీనికి సంబంధించి ఆ శాఖ అధికారులపై కొందరు టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అరెకరాల ఖాళీ స్థలం..

తోటగరువు వద్ద వెటర్నరీ ఆస్పత్రి వెనుక పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు 20 ఎకరాల భూమి ఉంది. దానిలో కొంత పశు గ్రాసం పండిస్తున్నారు. సుమారు అరెకరాల వరకు ఖాళీ స్థలం వదిలేశారు. దాని చుట్టూ ఎలాంటి రక్షణ గోడ, ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఇది స్థానికుల కార్లు, ఇతర వాహనాల పార్కింగ్ స్థలంగా మారిపోయింది. అంతటితో ఆగితే ఎలాంటి సమస్య ఉండదు. ఖాళీగా ఉండటం వల్ల ఆ స్థలంపై ఎవరి కన్ను పడితే ఆక్రమణకు గురికాక తప్పదని కొందరు స్థానికులు చెబుతున్నారు. ఇటువంటి స్థలాలు ఆక్రమణకు గురికాక ముందే అధికారులు రక్షించుకోవాలని సూచిస్తున్నారు.

నిధుల కొరతతో నిర్మించలేకపోతున్నాం

అవసరమైన నిధులు లేకపోవడంతో మా శాఖకు చెందిన స్థలాల చుట్టూ రక్షణ గోడలు నిర్మించుకోలేకపోతున్నాం. మా స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా సంరక్షించుకుంటున్నాం. ఇటీవల పెదగదిలి గెడ్డ అంచున మా స్థలం ఆక్రమణకు గురికాకుండా అడ్డుకున్నాం. దాని చుట్టూ రక్షణ గోడ నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచాం. త్వరలోనే గోడ నిర్మిస్తాం. వారం కిందట విశాలాక్షినగర్‌లో కొందరు మా స్థలంలో చదును చేస్తుండగా పనులు నిలిపేశాం. ఆ స్థలంపై సర్వే చేయడానికి ఆర్డీవోను కోరాం. మిగిలిన స్థలాల సంరక్షణలో భాగంగా రక్షణ గోడల నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– నీలయ్య, డీడీ, పశు సంవర్ధక శాఖ



పెదగదిలి గెడ్డ పక్కన ఆక్రమణకు గురైన పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలం



తోటగరువు వెటర్నరీ ఆస్పత్రి వెనుక రక్షణ గోడ లేని స్థలంలో కార్ల పార్కింగ్

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

ఆరిలోవ: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర స్థాయిలో రెండు రోజుల 'ప్రాంత అభ్యాస వర్గ' సమావేశాలు సోమవారం విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కాలేజీ సమావేశ మందిరంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ తాను నిరంతరం ఉపాధ్యాయుల పక్షాన నిలబడతానన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, డీఎస్సీ ద్వారా సక్రమంగా నియామకాలు, ఉపాధ్యాయుల రేషనలైజేషన్ తదితర వాటి గురించి విద్యా శాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించే వరకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:40 ఉండటమే మంచి విధానమని సూచించారు. దాన్ని మార్చి లేనిపోని నిష్పత్తులు పెట్టడం వల్ల విద్యా విధానానికి ఆటంకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకట సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవలో 'ప్రత్యాష' బృందం



మాట్లాడుతున్న సొసైటీ ఎండీ నిర్మల

ఆరిలోవ: విశాఖ మరియా మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యాష బృందం పేదలకు విశేష సేవలందిస్తోందని సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సిస్టర్ నిర్మల తెలిపారు. ఆరిలోవ సొసైటీ కార్యాలయంలో సోమవారం సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 35 ఏళ్లుగా ఆరిలోవ పరిసరాలతోపాటు నగరం, గ్రామీణ ప్రాంతాల్లో సైతం పేదలకు సేవలు అందిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సొసైటీ కృషి చేస్తోందన్నారు. ప్రత్యాష బృందంలో 11 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారన్నారు. కుటుంబ తగాదాలు పరిష్కరించడం, విడిపోవడానికి సిద్ధమైన భార్యాభర్తలను కలపడం తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. సుమారు 200 కుటుంబాల్లో విడిపోవడానికి సిద్ధమైన దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారు కలసిమెలసి ఉండేటట్లు కృషి చేశారన్నారు. ఈ సేవలన్నీ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఎన్నో సమస్యలను ఎదుర్కొని బృంద సభ్యులు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులను ఎండీ నిర్మల అభినందించారు. కార్యక్రమంలో ప్రత్యాష బృంద సభ్యులు జి.ఇందిరా, బి.పద్మ, ఎస్.రంగమ్మ, వరలక్ష్మి, పి.కోటమ్మ, డి.పద్మ, పి.కృష్ణవేణి, జి.దేవి తదితరులు పాల్గొన్నారు.

లౌకిక తత్వానికి హాని కలిగిస్తే సహించం

సీతంపేట: భారత లౌకిక తత్వానికి హాని కలిగిస్తే సహించమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ హెచ్చరించారు. కులవివక్ష పోరాట సమితి, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'మత స్వేచ్ఛ–భారత రాజ్యాంగం' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో హిందూవాదాన్ని లౌకిక రాజ్యాంగంలో బలవంతంగా రుద్దాలనే ప్రయత్నాన్ని అడ్డుకోవాలన్నారు. ఎంతో చరిత్ర ఉన్న భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మను సంస్కృతిని ప్రవేశ పెట్టాలనే ప్రయత్నాలు మొదలుపెట్టారని విమర్శించారు. ఇప్పటికే ఆర్ఎస్ఎస్ ఒకే దేశం.. ఒకే ఎన్నికలు, ఒకే పౌరస్మృతి వంటి వాదనలు తెస్తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను ముందుకు తీసుకురావడం వల్ల దేశ లౌకిక వాదానికి, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ ప్రజలకు తీరని నష్టం కలిగిస్తుందని, దీనిని ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ దేశంలోని అన్ని రాజ్యాంగ, మౌలిక వ్యవస్థలపైనా దాడి జరుపుతూనే ఉందన్నారు. దేశంలో సామాజిక న్యాయం అమలు చేయడం ఇష్టం లేని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బన్న, రాష్ట్ర నాయకులు భాగ్యలక్ష్మి, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు ప్రారంభించి మాట్లాడారు. జూన్ 6 వరకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కథలు, కథనాలు, పుస్తక పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఎంఈవో పుష్యరాగం మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకుల ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం



కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్న గురుకులాల గణిత ఉపాధ్యాయులు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం గురుకులంలో సోమవారం గురుకులాల గణిత ఉపాధ్యాయులకు మొదటి విడత కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ప్రారంభమైంది. ఈ నెల 30 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని గురుకులాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బెంగుళూరు అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీ నుంచి అనుపమ, రత్నకృష్ణ హాజరై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. గణిత బోధనలో మెలకువలు, విద్యార్థులు గణితంలో ఎక్కువ మార్కులు సాధించడానికి చేయాల్సిన కృషి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడే వేడుకలకు ఏర్పాట్లు



మేడే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: మేడే వేడుకలు ఘనంగా నిర్వహించడానికి కార్మికులు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. మద్దిలపాలెంలో సోమవారం మేడే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీఐటీయూ నాయకత్వంలో 40 చోట్ల పతాకా విష్కరణలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నేతృత్వంలో మే 1న మేడే జెండాల ఆవిష్కరణలతోపాటు మే 1 నుంచి 7 వరకు వారోత్సవాలు, మేడే సభలు జరపాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా మే 20న అన్ని కార్మిక సంఘాలతో కలిసి సమ్మె చేస్తున్నామని, కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని, కార్మికులకు విద్య, వైద్యం ఉచితంగా అందజేయాలని, రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపడుతున్నారన్నారు. జె.ఆర్.నాయుడు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, సీఐటీయూ జిల్లా నాయకులు డి.అప్పలరాజు మాట్లాడారు. జీవీఎంసీ 10వ వార్డు నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, హాస్పిటల్ వర్కర్స్ యూనియన్, తోపుడు బండ్ల వర్కర్స్ యూనియన్ ఆటో, ముఠా యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకంగా బంగారు పతకాలు

- విరాళాలు అందించిన ఏయూ ఆచార్యులు



ఏయూ వీసీ రాజశేఖర్‌కు చెక్కు అందిస్తున్న ఆచార్యులు శశికళ, వై.ఆర్.రెడ్డి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగంలో ఎం.ఎల్.ఐ.సి.కోర్సులో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందజేయాలని కోరుతూ విభాగ విశ్రాంత ఆచార్యులు సి.శశికళ రూ.1.50 లక్షల చెక్కును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు సోమవారం అందజేశారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సేవలందిస్తున్న డాక్టర్ వై.ఆర్.రెడ్డి హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ రూ.1.50 లక్షల చెక్కును అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకాలు అందించడానికి అవసరమైన నిధులను విశ్వవిద్యాలయానికి అందజేసిన ఆచార్య శశికళ, డాక్టర్ వై.ఆర్.రెడ్డిలను వీసీ రాజశేఖర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

ప్రత్యేక నైపుణ్యంతో గుర్తింపు



పెయింటింగ్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: విద్యార్థులు తమకంటూ ప్రత్యేక నైపుణ్యం సాధించడం ద్వారా గుర్తింపు పొందవచ్చని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో విద్యార్థులకు పెయింటింగ్‌పై ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించి, మాట్లాడారు. చిత్రలేఖనం, సంగీతం, నాట్యం తదితర కళల్లో రాణించాలంటే ప్రత్యేక తర్ఫీదు పొందాలన్నారు. ఈ సందర్భంగా ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై డి.భవాని విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ పెయింగ్‌పై ఉచిత శిక్షణ తరగుతులు మే 6 వరకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల పిల్లలు నేరుగా సాయంత్రం 4.30 నుంచి 6 వరకు పాల్గొనవచ్చన్నారు.